ఆర్ట్‌గ్యాలరీలో చిత్ర ప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం జేఎన్ ఏఎఫ్‌యూ కళాశాల స్కల్పర్ హెచ్‌ఓడీ ఎస్. కాంతారెడ్డి వేసిన చిత్రాలను ప్రదర్శించారు. ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రదర్శనలో 42 డ్రాయింగ్స్ ప్రదర్శించారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలి

కేపీహెచ్‌బీ కాలనీ: సైబర్ సెక్యూరిటీపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంటర్ సాఫ్ట్ సొల్యూషన్స్ సెక్యూరిటీ కన్సల్టెంట్ జయకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 'బ్లూ టీం సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ వ్యవహారాల నిర్వహణలో యూనిక్ పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం తప్పనిసరి అని అన్నారు. నకిలీ ఈ మెయిల్స్‌తో దృష్టిని ఆకర్షించే లింక్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. రద్దీ, బహిరంగ ప్రాంతాల్లో ఉచితంగా వస్తున్న వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించకుండా ఉండటం మంచిదన్నారు. ఎప్పటికప్పుడు యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను పునరుద్ధరించుకోవాలన్నారు. కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 62 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టించు కుంట లేరు

నామమాత్రంగా మల్లయ్యకుంట సుందరీకరణ పనులు

- కుంటలోకి చేరుతున్న మురుగునీరు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఆక్రమణలు



చందానగర్: చందానగర్‌లో చెరువుల సుందరీకరణ దాదాపుగా పూర్తికావొచ్చినా.. కొన్ని చెరువులను పట్టించుకోవడం లేదు. ఆ కోవలోదే మల్లయ్యకుంట చెరువు. జీహెచ్‌ఎంసీ నగరంలోని చెరువులు, కుంటల సుందరీకరణ పనులను ప్రత్యేక నిధులతో చేపడుతున్నారు. ఈ క్రమంలో మల్లయ్యకుంట చుట్టూ వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. నామమాత్రంగా మల్లయ్యకుంటను అభివృద్ధి చేశారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి కుంట చుట్టుపక్కల ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కానీ కుంట చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలంపై కబ్జాదారుల కన్నుపడింది. ఎఫ్‌టీఎల్‌లోకి వస్తున్నప్పటికీ స్థలంను శుభ్రం చేసుకొని ప్రహరీ గోడ నిర్మించి కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు వద్ద చేపట్టాల్సిన పనులు..

- మల్లయ్యకుంట వద్ద అసంపూర్తిగా ఉన్న సుందరీకరణ పనులను వెంటనే ప్రారంభించాల్సి ఉంది.
- చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి
- వాకింగ్ ట్రాక్‌ను పూర్తిస్థాయిలో నిర్మించాలి
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో సూచిక బోర్డులు పెట్టాలి
- చెరువులో చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలి
- చెరువులో భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి
- చెరువుకట్టపై వృద్ధుల కోసం బెంచీలు ఏర్పాటు చేయాలి
- చిన్నారులు, మహిళలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి
- ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలలో బోర్డులు ఏర్పాటు చేయాలి
- కుంట ప్రాంతంలో కబ్జాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సుందరీకరణ పనులు ప్రారంభించాలి



చందానగర్‌లోని మల్లయ్యకుంట చెరువులో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలి. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి.
–తిరుమలచారి, స్థానికులు

ఎఫ్‌టీఎల్ స్థలాలలో ప్రభుత్వ బోర్డులు పెట్టాలి



చెరువు చుట్టూ ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిలో బోర్డులు పెట్టాలి. హుడా కాలనీకి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలి.
– విజయ్‌కుమార్, స్థానికుడు



కాలనీల నుంచి చెరువులోకి చేరుతున్న మురుగునీరు



అసంపూర్తిగా వాకింగ్‌ట్రాక్



మల్లయ్యకుంట చెరువు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమి

24న రుద్రహోమం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ఈనెల 24వ తేదీ (ఆదివారం) రుద్రహోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో ఆరంభించి రుత్విక్‌వరుణ, దీక్షాధారణ, శైవాగమ పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, త్రిశూలపూజ, అస్త్రరాజార్చన, మహన్యాస మంత్రపఠనం, అమృతేశ్వరుడికి 21 ద్రవ్యములతో విశేష అభిషేకం, రుద్ర హోమం, పూర్ణాహుతి, పండితాశీర్వచనం, ప్రసాద వితరణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నసమారాధన ఉంటుందని పేర్కొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో స్నేక్ షో



గచ్చిబౌలి: పాములు ప్రకృతి నేస్తాలని చిన్నారులకు అవగాహన కల్పించారు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులు. శుక్రవారం నిర్వహించిన స్నేక్ షోలో నేల మీద, చెట్లపై, నీటిలో తిరిగే పాములు, వాటి స్వభావం గురించి వివరించారు. విషం ఉన్న, విషం లేని పాముల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాములు ఎక్కడ నివాసం ఉంటాయి, అవి ఏమి తింటాయో చిన్నారులకు వివరించారు. ఆకుపచ్చ రంగులో చెట్లపై ఉండే పాములు, జెర్రిపోతు, నీరికట్టె, రెండు తలల పాములను చూపించారు. కాగా బొటానికల్ గార్డెన్ సందర్శించేందుకు వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులు తరలి వచ్చారు.

అక్రమ నిర్మాణం చేపడితే చర్యలు

పటాన్‌చెరు టౌన్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్ తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలో అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ నుండి తీసుకున్న అనుమతి మేరకు నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులు మించి నిర్మిస్తే, నోటీసులు జారీచేసి కూల్చి వేస్తామని చెప్పారు. ఇప్పటికే గ్రామ పరిధిలో అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు పుస్తకాలు చదవాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వరి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని కంజర్ల గ్రామ సమీపంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహేశ్వరి మాట్లాడుతూ.. పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం కలుగుతుందని ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఉపేందర్ ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



శేరిలింగంపల్లి: 'సాధన ఇన్ఫినిటీ' ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. నల్లగండ్లలోని స్కూల్ క్యాంపస్‌లో 'పనాచే-ట్విస్టెడ్ టేల్స్' పేరిట ఆధునిక అభ్యాసంలో పాత కథల కాలానుగుణ సంబంధంపై దృష్టి పెట్టేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా, పాఠశాల చైర్మన్ సునంద్ సూరపనేని, చైర్ పర్సన్ పద్మప్రియ సూరపనేని, మేనేజింగ్ డైరెక్టర్ సాధన సూరపనేనితో కలసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, కళాత్మక ప్రదర్శనలు, సంగీతం ఆకట్టుకున్నాయి. అనంతరం డైనమిక్ స్కూల్స్–2024 అవార్డులు, యూనిక్ క్లాస్‌రూమ్ ఎంగేజ్‌మెంట్ ఇనీషియేటివ్స్, ఎక్స్‌లెన్స్ వంటి అంశాలలో ప్రతిభ చాటిన సారాసక్సేనా, నవజీవన, సింధూలు గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన భువన్ చన్నా లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ మురళీమోహన్, ప్రిన్సిపల్ (సీబీఎస్‌ఈ) శోభన సిరోహి, ప్రిన్సిపల్ (కేంబ్రిడ్జ్) సరితకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

10 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహన దారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 10 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్‌నగర్ ఫేజ్ 1, 2లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కాలనీవాసులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సమష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దవచ్చన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సాయి ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

పటాన్‌చెరుటౌన్: అప్పుల బాధ భరించలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం... బీరంగూడ పరిధిలోని సృజన లక్ష్మీనగర్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అక్టోబర్ 7వ తేదీ ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా, తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో అదృశ్యమైన శ్రీనివాస్ బావ గోవిందరాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

25న 'జర్నీ ఆఫ్ టీబీ అండ్ కొవిడ్.. లెసన్స్ ఫర్ ఫ్యూచర్ ఛాలెంజెస్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఉంటుంది.స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ సహకారంతో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు 'జర్నీ ఆఫ్ టీబీ అండ్ కొవిడ్.. లెసన్స్ ఫర్ ఫ్యూచర్ ఛాలెంజెస్' అనే అంశంపై ఈ ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమానికి ప్రిన్సిపల్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ఉపన్యసిస్తారు.

ఎఫ్ఏబీఏ లైఫ్‌టైమ్ అవార్డు

ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్(ఎఫ్ఏబీఏ) ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో డాక్టర్ సౌమ్య స్వామినాథన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో ఆరోగ్య సంరక్షణ రంగంలో ఆమె చేసిన కృషికి ఈ అవార్డును అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కొవిడ్ సందర్భంగా ఆమె కొవాక్సిన్ అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు.

నవోదయ విద్యార్థులకు సత్కారం

థాయిలాండ్‌లో జరిగిన పారాఅథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులు



పతకాలు సాధించిన దివ్యాంగ విద్యార్థులతో ఉపసంచాలకులు గోపాలకృష్ణ తదితరులు

రాయదుర్గం: రంగారెడ్డిజిల్లా జవహర్ నవోదయ విద్యాలయ దివ్యాంగ విద్యార్థులకు అరుదైన గౌరవం లభించింది. వారిని శుక్రవారం శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా క్యాంపస్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా నవోదయ విద్యాలయ సమితి ఉపసంచాలకులు తలపల గోపాలకృష్ణ, జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ విజయభాస్కర్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రెండు రోజుల క్రితం న్యూఢిల్లీలోని కౌశల్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి, ఒలింపిక్ పతక విజేత అభినవ్‌బింద్ర చేతుల మీదుగా అథ్లెటిక్స్‌లో మెడల్స్ సాధించిన జానూరావత్, శివాని, జ్యోతి, షూటింగ్‌లో మెడల్ సాధించిన కుష్బూ, పావనిలను ఘనంగా సత్కరించారు. వీరంతా ఇటీవల థాయిలాండ్‌లో జరిగిన పారా అథ్లెటిక్స్‌లో రాణించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి పోయాలని సూచించారు. అదే విధంగా అసంపూర్తి రోడ్ల పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీ మున్నా, రాజిరెడ్డి, పోశెట్టి గౌడ్, వాలి నాగేశ్వర రావు, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాసర్ బాయ్స్ స్కూల్ వార్షిక క్రీడోత్సవాలు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్ వార్షిక క్రీడోత్సవాలను శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పాఠశాల క్యాంపస్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సండే మార్కెట్‌కు రోడ్డు ఏర్పాటుతో బాటు రహదారులను విస్తరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌గౌడ్, పీటర్, ఐలేష్, మల్లేష్‌లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మియాపూర్: జాతీయ రహదారిపై వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మదీనాగూడ జాతీయ రహదారిపై మంజునాథ వైన్స్ సమీపంలో ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించి అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు తెలిపారు. అతని గురించి చుట్టుపక్కల ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



చందానగర్: పాపిరెడ్డి కాలనీ, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు హఫీజ్‌పేట్, న్యూ హఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, న్యూ హఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్, వైశాలీనగర్, మార్తాండనగర్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, బీహెచ్‌ఈఎల్ హెచ్‌ఐజీ, సమత కోఆపరేటివ్ కాలనీ, మైత్రీనగర్, మదీనాగూడ, ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ పాంతాలలో విద్యుత్ ఉండదు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్‌కాలనీ, రైల్వే స్టేషన్, జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదు.
- సాయిరాం నగర్, మైత్రీనగర్, ఆదిత్య నగర్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్డు, జనప్రియనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ ఫేజ్ 1,2,3,4,5,6, ప్రజయ్ సిటీ, ఇండస్ట్రీయల్ ఏరియా, ఆదిత్యానగర్, ఎస్‌సిబి కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్, కుమ్మరిబస్తీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, దేవి హోమ్స్, భాను టౌన్‌షిప్ ఏరియాలలో ..

వేమనకాలనీ సబ్ స్టేషన్ పరిధిలో..

- ఫ్రెండ్స్ కాలనీ, భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు అర్జున్ రెడ్డి కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీ రోడ్డు నంబర్ 4,5,6, కైలాష్ నగర్ శ్రీదేవి థియేటర్ దగ్గర, ఎస్‌వీఎస్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌యంటీ 11కెవి ఫేజ్ 2 ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడ్డగుట్ట, వాటర్ ట్యాంక్ ప్రాంతం, శాతవాహన కాలనీ రోడ్డులో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతా



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిచేసి అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బొల్లారం ప్రధాన రహదారి నుండి బీకే ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీ, ప్రజాషెల్టర్ నుండి మక్తమహబూబ్‌పేట విలేజ్ వరకు లింక్ రోడ్డు రూ.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తుల కృషిచేస్తానని తెలిపారు. త్వరితగతిన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కాటేస్తున్న కాలుష్యం!

- ఇష్టారాజ్యంగా రెడీమిక్స్‌ల ఏర్పాటు
- కొనసాగుతున్న క్రషర్‌లు
- కాలుష్యం.. శబ్దాలను భరించలేక పోతున్న ప్రజలు
- నేడు ఆందోళనకు సిద్ధమైన బాధిత ప్రజానీకం



జనావాసాల పక్కనే కొనసాగుతున్న రెడీమిక్స్ ప్లాంట్

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిర్మాణ స్థలంలోనే రెడీమిక్స్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నారు. వాటి పక్కనే అప్పటికే నిర్మితమైన కమ్యూనిటీలు, కాలనీల్లోని ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి చేరి నివాసితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

- జనావాసాలకు సమీపంలో కొత్తగా వచ్చే నిర్మాణాలలో రెడీమిక్స్‌లకు అనుమతులు ఇవ్వాలంటే వారి నుంచి నోఅబ్జక్షన్ పత్రాలు తీసుకోవటం, లేదంటే జనావాసాలకు దూరంగా ప్లాంట్‌లకు అనుమతులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలు ఉన్నాయి. స్థానికంగా వాటిని పట్టించుకోకుండా ఎడాపెడా అనుమతులు ఇవ్వటంతో అప్పటికే నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగుల పల్లి, కోకాపేట, ఖానాపూర్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో క్రషర్‌లు కొనసాగుతున్నాయి. వాటిల్లో ఒకటి, రెండింటికి మాత్రమే అధికారికంగా అనుమతులు ఉండగా మిగతావన్నీ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారికి కొందరు మంత్రులు అండగా నిలవటంతో యథేచ్ఛగా కొనసాగాయి. అప్పటికే పీసీబీ కొన్నింటిని సీజ్ చేసింది. వాటికి విద్యుత్ సరఫరాను సైతం నిలిపివేయించింది. వారం రోజుల్లోనే అవి తిరిగి ప్రారంభమయ్యాయి.

ఆందోళన దిశగా కాలుష్య బాధితులు..

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా నివాసితులు పీసీబీ, రెవెన్యూ అధికారులతో పాటు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు పలుమార్లు కాలుష్యపు కోరల నుంచి విముక్తి కల్పించాలని వినతి పత్రాలను సమర్పించారు. అయినా ఎలాంటి చర్యలు లేనందున శనివారం ఆందోళన చేయాలనే నిర్ణయానికి వచ్చామని తెలిపారు.

గోపన్‌పల్లితండాలో ఫార్మసీ ప్రారంభం



రాయదుర్గం: గోపన్‌పల్లితండా కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన అపర్ణ ఫార్మసీని ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరసమైన ధరలకు మందులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొండావిజయ్‌కుమార్, స్థానికులు ప్రసాద్, రాజునాయక్, సురేష్‌నాయక్, వినయ్‌కుమార్,వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.